క్లుప్తంగా

అంగన్‌వాడీ ఉద్యోగుల ధర్నాకు తరలిరండి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చాలీచాలని జీతాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 3న నిర్వహించే ధర్నా కార్యక్రమానికి అంగన్‌వాడీ ఉద్యోగులు, హెల్పర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా జిల్లా కన్వీనర్ సామల కవిత, సీఐటీయూ నాయకులు పోచమల్లు, గడ్డం రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థి వికాసమే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న ఫయాజ్

ముస్తాబాద్: విద్యార్థి వికాసం ద్వారా మాత్రమే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు షేక్ ఫయాజ్ అన్నారు. మండలంలోని ఆవునూర్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులకు మానసిక వికాసంపై సదస్సు నిర్వహించారు. ఫయాజ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలన్నారు. ఏ పరీక్ష విద్యార్థి చదువులకు గీటురాయి కాదన్నారు. వ్యక్తిత్వ వికాసం, సబ్జెక్టుపై పూర్తి పట్టు సాధించాలన్నారు. విషయ అవగాహన ద్వారా ఉన్నత లక్ష్యం చేరుకోవాలన్నారు. ప్రముఖుల జీవిత చరిత్ర చదవాలని, నిరంతర చదువుతోపాటు ఆటపాటలకు సమయం కేటాయించాలన్నారు. ఎంపీపీ శరత్ రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ కల్యాణి, ఎంపీటీసీ లలిత, హెచ్ఎం రాజునాయక్ పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వర తండాలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్, ఏంపీవో వజీర్, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ పంతులు, కార్యదర్శి సిరియా, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నయ్

- 'చివరి' ఆయకట్టుకు చేరని నీరు
- పారని మానేరు ప్రాజెక్టు కాలువలు
- ఆందోళనలో అన్నదాతలు
- వందల ఎకరాల్లో వరి పంటకు నష్టం

ముస్తాబాద్: మానేరు ప్రాజెక్టు కింద వరి పంటలు ఎండుతున్నాయి. యాసంగి పంటలకు పెట్టిన పెట్టుబడి అయినా చేతికి వత్తదో రాదోననే ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. కళ్లెదుటే పంటలు ఎండుతుంటే ఆగం అవుతున్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న పంటలకు చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యాసంగికి ఉండే నీటి ఇబ్బందులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు అంటున్నారు. ఏటా సాగులోకి వస్తున్న పంటలకు సరిపడా నీటిని విడుదల చేయడంలో నిర్లక్ష్యం చివరి ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. ప్రాజెక్టులో నీరున్న వాటిని రైతులకు సరఫరా చేయడంలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్ది గ్రామాలలో డీ–18 నుంచి డీ–24 వరకు నీటి సరఫరా జరగడం లేదు.


పోతుగల్ వద్ద ఖాళీగా వున్న కెనాల్‌లో కూర్చున్న రైతులు


ఎండిన వరి పంట


నీటి సరఫరా నిలిచిపోయిన మానేరు కెనాల్

లోతు చెరువు రిజర్వాయర్‌తో సమస్య

ఎగువ మానేరు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా 34 కిలోమీటర్ల మేర నీటి సరఫరా చేస్తున్నారు. ఒక్క ముస్తాబాద్ మండలంలోని 10 వేల ఎకరాలకు తైబందీ తీర్మానించారు. అయితే ప్రాజెక్టు నుంచి విడుదలైన నీరు, మల్లారెడ్డిపేట సమీపంలోని లోతు చెరువు రిజర్వాయర్‌ను గ్రావిటీ ద్వారా చేరుతుంది. అయితే ఇక్కడి రిజర్వాయర్‌లో కనీసం 14 ఫీట్ల మేరకు నీరు నిల్వ ఉంటేనే ముస్తాబాద్ వైపు నీరు గ్రావిటీ ద్వారా వస్తుంది. ప్రస్తుతం 13 ఫీట్ల వరకు మాత్రమే నీరు ఉంది. పైగా ఇక్కడి షట్టర్లను రైతులు తరచూ పైకి లేపడంతో నీరు వృథాగా పోతోంది. తైబందీకి మించి సాగు చేయడంతో అధికారులకు తెలియకుండా రైతులు నీటిని తరలించుకుపోవడంతో ముస్తాబాద్, నామాపూర్, పోతుగల్, తెర్లుమద్దికి నీరురావడం లేదు. ఇక్కడ షట్టర్లు కూడా లీకేజీ అవుతున్నాయి. దాని మరమ్మతు చేసి, ప్రాజెక్టు నీటిని చివరి వరకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

పది రోజులుగా నిలిచిన సరఫరా

పోతుగల్, తెర్లుమద్ది గ్రామాల్లో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లోతు చెరువులో 13 ఫీట్ల నీటి నిల్వ ఉండడంతో కెనాల్‌లోకి నీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. తద్వారా ప్రాజెక్టుకు చివరి గ్రామాలైన ముస్తాబాద్, పోతుగల్, తెర్లుమద్దిలో సాగు చేస్తున్న వరి పంటకు నీరందే పరిస్థితి కనిపించడం లేదు. కేవలం కెనాల్‌ను నమ్ముకుని రైతులు వరి పంటలు వేయగా అవి బీటలు వారుతున్నాయి. పోత్గల్‌లో ఈరవేని దేవయ్య, బాలయ్య, రాజమల్లయ్య, రాగం పర్వతాలు, అనమేని నాంపెల్లి, గోద బాలవ్వ, ఈర్ల పెద్దమల్లయ్య, చిన్న మల్లయ్య, అనమేని అంజయ్య, జెల్లి దేవయ్య, శ్రీనివాస్, వెంకటికి చెందిన పంటలు ఎండిపోతున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు

మానేరు ప్రాజెక్టు ద్వారా సాగుచేస్తున్న రైతులకు చివరి పొలాలను రక్షించాలని సర్పంచులు గౌతంరావు, కిషన్‌రావు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ప్యాకేజీ–12 మల్లన్నసాగర్ ద్వారా ముస్తాబాద్, నామాపూర్ చెరువులకు గోదావరి నీటిని తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో గోదావరి నీటితో పెద్ద చెరువును నింపి, ఇక్కడి నుంచి పోతుగల్ గంగమ్మ వాగులోకి, తెర్లుమద్ది కెనాల్‌లోకి నీటిని తరలిస్తామని అంటున్నారు. కాగా బోరుబావుల కింద సాగు చేసుకుంటున్న రైతులకు ఇబ్బందులు తలెత్తలేదు. కెనాల్ ద్వారా మాత్రమే సాగు చేసుకునే వారికే తిప్పలు తప్పడం లేదు.

ఎకరం ఎండిపోయింది



నాకున్న ఎకరం పొలంలో రూ.20 వేలు పెట్టుబడి పెట్టి వరి పంట సాగు చేస్తున్న. పంట పొట్ట దశకు వచ్చింది. పది రోజులుగా మానేరు నీళ్లు వత్తలేవు. దీంతో పంట మొత్తం బీటలు వారింది. పంట చేతికి వత్తుందో రాదో అని భయపడుతున్న. సార్లకు ఫిర్యాదు చేసినం.
– ఈర్ల చిన్న నర్సయ్య, పోతుగల్

కెనాల్‌ను నమ్ముకుని పంటలు వేసినం



నేను ఆరు ఎకరాలు వేసిన. కెనాల్‌ను నమ్ముకుని పంటలు సాగుచేస్తున్న. ఎప్పుడు ఇట్ల కాలేదు. కళ్ల ముందే పంటలు ఎండుతుంటే దుఃఖం వస్తుంది. పెట్టుబడులు మీద పడుతయి. లోతు చెరువుల సంగతి అధికారులకు తెలిసిన పట్టించుకోలేదు.
– అనమేని రాజు, పోతుగల్

నీళ్లు లేక పంట ఎండిపోయింది



నాకున్న రెండు ఎకరాల్లో వరి పంట వేసిన. కెనాల్ కిందనే నా భూమి ఉంది. బోరు లేదు. కెనాల్‌ను నమ్ముకుని పంటలు వేస్తే అవి ఎండిపోతున్నాయి. మానేరు నీళ్లు మత్తుగానే ఉన్నయి అంటున్నరు. మరి ఎందుకు ఇడుస్తలేరు. మమ్మల్ని ఆదుకోవాలే.
– అక్కరాజు మల్లయ్య

కాళేశ్వరం నీరు సరఫరా చేస్తున్నాం

లోతు చెరువులో కొంత మరమ్మతు ఉంది. అందులో సరైన నీటి నిల్వ లేదు. గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేస్తున్నాం. వేసవిలో నీటి నిల్వలు సరిగా మెయింటెన్ కావు. ప్రస్తుతం మానేరులో 1.17 టీఎంసీ నీరు ఉంది. రోజుకు వంద క్యూసెక్కులు విడుదల చేస్తున్నాం. అంచనాకు మించి సాగుచేయడంతో సమస్య. మల్లన్నసాగర్ గోదావరి జలాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం.
– నర్సింగ్, డీఈఈ

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు

- రూ.కోటి 20 లక్షలతో అదనపు భవన నిర్మాణం
- టెస్కాబ్ ౘైర్మన్ రవీందర్‌రావు


భూమిపూజ చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. ఆసుపత్రి ఆవరణలో రూ.కోటి 20 లక్షలతో నూతనంగా చేపట్టనున్న అదనపు భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేసి మట్లాడారు. గంభీరావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం ఇటీవల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినట్లు తెలిపారు. మరికొద్ది రోజుల్లోనే అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, వైస్ ఎంపీపీ లత, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు లతారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

బేబీ ఫీడింగ్ ఇదేనా?



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో పిల్లతల్లులున్న భక్తులకు బేబీ ఫీడింగ్ క్యాబిన్‌లను ఇటీవలే ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే పారిశుధ్యం సిబ్బంది మాత్రం ఇందులో చీపుర్లను, చెత్త బకెట్లను పెట్టేస్తున్నారు. దీంతో పిల్లతల్లులు ఇందులోకి ఎలా వెళ్లి తమ చిన్నారులకు పాలు ఇస్తారో ఆలయ అధికారులు ఆలోచించాలంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి:
కృష్ణప్రసాద్, ఆలయ ఈవో
ఫోన్ నంబర్:
94910 00743

నిధులు లేక నిలిచిన నిర్మాణం

- అసంపూర్తిగా మహిళా సంఘం భవనం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- సమావేశాలకు ఇబ్బంది పడుతున్న సంఘం సభ్యులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


అసంపూర్తిగా నిర్మించిన మహిళా సంఘం భవనం

సిరిసిల్లఅర్బన్: మహిళా సంఘాల సభ్యులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశ్యంతో ప్రభుత్వం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరులో మహిళా సంఘం భవనానికి నిధులు మంజూరు చేసింది. నిధులు సరిపోకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు. దీంతో మహిళా సంఘం సభ్యులు ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. చెట్ల కింద, వార్డు కార్యాలయంలో సమావేశాలు నిర్వహించుకోవాల్సి వస్తోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

పంచాయతీ హయాంలో నిర్మాణం

పెద్దూరు పరిధిలో దాదాపు 65 మహిళా సంఘాలు ఉండగా 700 మంది మహిళా సభ్యులు ఉన్నారు. అదేవిధంగా మూడు గ్రామైక్య సంఘాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని మహిళా సంఘాల భవన నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేస్తుండగా మంత్రి కేటీఆర్‌ని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. భవన నిర్మాణానికి స్థలం చూపిస్తే నిధులు మంజూరు చేస్తామని తెలపడంతో 2014లో పెద్దూరు శివారులో మహిళా సంఘం సభ్యుల సొంత నిధులతో దాదాపు రెండు గుంటలపైగా భూమిని కొనుగోలు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి కేటీఆర్ రూ.5 లక్షలు మంజూరు చేశారు. అప్పటి ప్రజాప్రతినిధులు నిర్మాణ పనులు చేపట్టి భవనం స్లాబ్ వరకు పూర్తి చేశారు. నిధులు సరిపోవడం లేదని మధ్యలోనే పనులను నిలిపివేశారు. భవనాన్ని పూర్తిచేయాలని అప్పటి ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా, ఎవరు పట్టించుకోకపోవడంతో వదిలి పెట్టారు.

విలీనం అనంతరం పట్టింపు కరువు

దాదాపు నాలుగేళ్ల క్రితం సిరిసిల్ల సమీప గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేశారు. గ్రామంలోని 65 మహిళా సంఘాలను, మూడు గ్రామ సమైక్య సంఘాలు ఐకేపీ పరిధిలో పనిచేస్తుండగా, మున్సిపల్‌లో విలీనం కావడంతో మెప్మాలో కలిపారు. మున్సిపల్‌లో కలవడంతో మహిళ సంఘం భవనాన్ని పట్టించుకునే వారు లేరని మహిళ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిపిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతినెల సమావేశాలు జరిపేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నామని, చెట్లక్రింద, అప్పుడప్పుడు వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి మహిళా సంఘం భవన నిర్మాణానికి కృషి చేయాలని వేడుకుంటున్నారు.

చెట్ల కింద సమావేశాలు



పెద్దూరులో మహిళా సంఘం భవనం లేకపోవడంతో సమావేశాలు జరిపేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. సొంత నిధులతో స్థలాన్ని కొనుగోలు చేసుకొగా, మంత్రి కేటీఆర్ చొరవతో రూ.5 లక్షలు మంజూరు చేశారు. కానీ నిధులు సరిపోకపోవడంతో అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. సమావేశాలను చెట్ల కింద జరుపుకుంటున్నాం. మా సమస్యలను ఎవరు పట్టించుకోవడం లేదు.
– తిప్పవరం సుధ, గ్రామ సమైక్య అధ్యక్షురాలు, పద్దూరు

నిర్మాణానికి నిధులు కేటాయించాలి



అసంపూర్తిగా ఉన్న మహిళా సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. చాలా ఏళ్ల నుంచి సంఘం సమావేశాలను చెట్ల కింద, వార్డు కార్యాలయంలో జరుపుకుంటున్నాం. అనేక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. భవన నిర్మాణానికి అవసరమయ్యే నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలి.
– భూక్య లావణ్య, మహిళా సంఘం కార్యదర్శి పెద్దూరు

మాదిగ అమరవీరులకు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

వీర్నపల్లి: మాదిగ అమరవీరుల ఆశయ సాధనకు కోసం పోరాడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ మాదిగ అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్గీకరణ కోసం పోరాడి అమరులైన వారికి నివాళి అర్పించారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేస్తానని గద్దెనెక్కి, ఎనిమిదేళ్లుగా కాలయాపన చేస్తోందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని, లేందటే ఓట్ల కోసం మా వాడలకు వస్తే బీజేపీ నాయకులను తరిమికొడతామన్నారు. ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వద్లూరి రాజం పాల్గొన్నారు.

వేములవాడరూరల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ గుండా థామస్, మండల కన్వీనర్ మ్యాకల బాబు, మ్యాకల ఇసాక్, పూడూరు పోచయ్య, లేగల రాజమల్లు, పూడూరి దేవయ్య, గుండ మల్లేష్, మ్యాకల శంకర్, గుండ మహేందర్, భూమయ్య, లక్ష్మణ్, జీవన్, కిరణ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలో జరిగే బహిరంగ సభకు మండలం నుంచి 1500 మందిని తరలిస్తామన్నారు. మలక్పేట రిజర్వాయర్ నుంచి 9వ ప్యాకేజీ కింద ఇప్పటి వరకు పనులు పూర్తికాని కాలువలను పరిశీలించాలని రేవంత్‌రెడ్డిని కోరుతామన్నారు. ఎల్లారెడ్డిపేటలో డీగ్రీ కళాశాల, 100 పడకల ఆసుపత్రి తదితర సమస్యలపై ఆయనకు వివరిస్తామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

3న మానకొండూర్ లో..

ఇల్లంతకుంట: మానకొండూర్ నియోజకవర్గంలో ఈనెల 3న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రకు కాంగ్రెస్ నాయకులు, ప్రజలు, రైతులు తరలిరావాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లను కైవసం చేసుకుని అధికారంలోకి రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆనందరెడ్డి, వెంకన్న, వినయ్, నరేష్, రాజేశం, జమాల్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారం

రేపు మండల సర్వసభ్య సమావేశం

కోనరావుపేట: ఈ నెల 3న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

లైట్ ట్రాప్స్‌తో చీడ పీడల నివారణ

చందుర్తి: వరి పొలాలను ఆశిస్తున్న కీటకాలను, చీడపీడల నివారణకు రైతులు పంట పొలాల్లో లైట్ ట్రాప్స్‌ను వినియోగించుకోవాలని ఏఏవో మహేశ్వరి అన్నారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసిన వరి పొలాలకు కీటకాల ఉధృతి అధికంగా ఉందన్నారు. అనేక రకాలైనా చీడ పీడలు ఆశిస్తూ పంట పొలాలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయన్నారు. ఆధునిక పద్ధతులను అవలంభించి పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఎకరం పంట పొలాల్లో నాలుగు లైట్ ట్రాప్స్‌ను వినియోగిస్తే రాత్రివేళ పంటలను ఆశించే రెక్కలు, తల్లి పురుగుల ఉధృతిని నివారించవచ్చునన్నారు. లైట్ ట్రాప్ మార్కెట్‌లో తక్కువ ధరకే లభ్యమవుతున్నాయన్నారు. పంటలను ఆశించే చీడపీడల నివారణ కోసం చేసే ఖర్చులో సగానికి లైట్ ట్రాప్స్‌ల ఏర్పాటుకు పెడితే చీడ పీడలను, క్రిమి కీటకాల ఉధృతిని తగ్గించుకోవచ్చునన్నారు. మోతాదుకు మించి క్రిమి సంహారక మందులను వినియోగించడంతో పంటలకు మేలు చేసే మిత్ర పురుగుల సంహరించబడి, పంటలకు నష్టం జరుగుతుందన్నారు. పంట సాగులో మెలకువలను పాటిస్తేనే పెట్టుబడి తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారని ఆమె వివరించారు.

నట్టల నివారణ మందులు పంపిణీ


మందులు పంపిణీ ప్రారంభిస్తున్న ఎంపీపీ

తంగళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మూగ జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తోందని కాపరులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. మండల కేంద్రంలో బుదవారం నట్టల నివారణ మందుల పంపిణీని సర్పంచ్ అంకారపు అనితతో కలిసి ప్రారంభించారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఎగుర్ల కరుణాకర్, గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడు దొందడి రాజు పాల్గొన్నారు.

బోరు బావులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న వైస్ ఎంపీపీ అబ్రహం

చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామంలోని గౌడ, అంబేద్కర్ కమ్యూనిటీ భవనాల వద్ద బోరు బావులకు వైస్ ఎంపీపీ మందాల అబ్రహం బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్ల లక్ష్మీనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, లింగంపేట ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన

వీర్నపల్లి: మండల కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులను సర్పంచ్ పాటి దినాకర్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బోయిని రవి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఎడబొయిన లక్ష్మి–మల్లేశం దంపతుల కూతురు స్వాతి వివాహానికి సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి బుధవారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు హసన్‌అలీ, ధర్మేందర్, రామరాజం, ప్రభాకర్, రామదాసు, శేఖర్, రమేశ్, సందీప్ పాల్గొన్నారు.